క్లుప్తంగా

నేడు, రేపు ఆధార్ అప్‌డేషన్ శిబిరాలు

అనపర్తి: మండలంలోని పులుగుర్త, మహేంద్రవాడ–1, రామవరం–2, అనపర్తి–4 సచివాలయాల పరిధిలో ఈ నెల 27, 28 తేదీల్లో ఆధార్ అప్‌డేషన్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బీఎల్ నరసింహం తెలిపారు. 2010–2016 సంవత్సరాల మధ్య ఆధార్ కార్డు మంజూరై, ఇప్పటివరకూ అప్‌డేట్ చేసుకోనివారికి ఈ అవకాశం కల్పించామన్నారు. రేషన్ కార్డు, పాన్ కార్డు, గుర్తింపు కార్డు, బ్యాంకు పాస్‌బుక్ తదితర ఏదైనా ఒరిజినల్ డాక్యుమెంట్లను వెంట తీసుకెళ్లి అప్‌డేట్ చేయించుకోవొచ్చన్నారు.

నేడు అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరంలోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నట్టు ఈఓ పాటి సత్యనారాయణ తెలిపారు. శివరాత్రి అనంతరం ఏటా మాదిరిగానే అన్న సమారాధన నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణ పనుల పరిశీలన


నిర్మాణ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని పందలపాకలో కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆదివారం పరిశీలించారు. గ్రాసిం ఇండస్ట్రీస్ సౌజన్యంతో గ్రామంలో బీసీల కోసం నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు పనులు శరవేగంగా జరుగుతున్నాయని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సత్తి హరిప్రసాద్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పడాల వెంకటరెడ్డి(పెద్దబుజ్జి), మాజీ సొసైటీ ఉపాధ్యక్షుడు వంక రమేష్, కర్రి సతీష్, పారిచర్ల వీర వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గోగులమ్మ తల్లి తీర్థం


అమ్మవారిని దర్శించుకున్న ఉపసర్పంచి కొవ్వూరి సత్యనారాయణరెడ్డి

బిక్కవోలు: మండలంలోని కొమరిపాలెంలో గోగులమ్మ తల్లి తీర్థం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కొమరిపాలెంతో పాటు పందలపాక, తొస్సిపూడి, రాయవరం, కొప్పవరం తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం సుమారు 12 వేల మందికి అన్న సమారాధన చేసినట్లుగా ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీదేవి కనకదుర్గ తీర్థం


ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి కనకదుర్గ అమ్మవారు

రంగంపేట: చంద్రేడులో కొలువై ఉన్న శ్రీదేవి కనకదుర్గ అమ్మవారి వార్షిక తీర్థ మహోత్సవం ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని పూలదండలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాత్రి ఆలయం వద్ద నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

18న ఒనువులమ్మ విగ్రహ ప్రతిష్ఠ

రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామంలో సుమారు రూ.2 కోట్లతో అత్యంత సుందరంగా నిర్మిస్తున్న ఒనువులమ్మ ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమం మార్చి 18న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. 18వ తేదీ 10.18 గంటలకు ప్రతిష్ఠ మహోత్సవం, యంత్ర స్థాపన, పూర్ణాహుతి అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహిస్తారు. 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రుత్విక్కులతో హోమాలు, ప్రత్యేక పూజలు, 17వ తేదీన అమ్మవారి గ్రామ ప్రదక్షిణం, కళాహోమం జరుగుతుంది. సమావేశంలో ఉప్పులూరి సత్యనారాయణ, శివరామకృష్ణ, కిషోర్, ఉప్పులూరి రాము, మాసిన సుబ్బారావు, సుంకవల్లి వెంకట రత్నం, వెంకట్రావు పాల్గొన్నారు.

పొందికైన అక్షరాలు.. తెస్తాయి మార్కులు

- చేతిరాతపై శ్రద్ధ చూపాలంటున్న నిపుణులు
- మెళకువలు పాటిస్తే మెరుగైన ఫలితాలు


కొంకుదురులో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

బిక్కవోలు: ప్రపంచ చరిత్రకు మూలధారం అక్షరాలే. ఉలితో రాళ్లపై అక్షరాలు చెక్కిన కాలమైనా.. కీ బోర్డుపై అక్షరాలను కదిలించే కంప్యూటర్ యుగమైనా అక్షరాలది చెక్కు చెదరని స్థానమే. చేతిరాతను బట్టి వారి గుణగణాలను అంచనా వేయవచ్చంటారు గ్రాఫాలజిస్టులు. భాషేదైనా భావాన్ని సులభంగా అందించేది చూడచక్కని దస్తూరీయే.. అక్షరాలను ముత్యాల్లా రాసే అలవాటును సొంతం చేసుకుంటే పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ శ్రేణి సాధించొచ్చని విద్యావేత్తలు చెబుతున్నారు.
మార్చి 15 నుంచి ఇంటర్మీడియెట్ పరీక్షలు, ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు అదనపు మార్కుల సాధనకు చేతిరాతపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని నిపుణులు చెబుతున్నారు.
అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల పరిధిలో 4,863 మంది విద్యార్థులు పదోతరగతి, 9 వేల మంది ఇంటర్మీడియెట్ చదువుతున్నారు. సమాధాన పత్రం మూల్యాంకనం చేసే ఉపాధ్యాయుల మనసును హత్తుకొనేలా దస్తూరి ఉంటే మంచి మార్కులు సాధించొచ్చని సూచిస్తున్నారు. నేర్చుకోవాలనే ధ్యాస, నిరంతర సాధన ద్వారా కేవలం 21 రోజుల్లోనే చేతిరాతలో గణనీయమైన మార్పును సాధించొచ్చంటున్నారు.

విద్యావేత్తల సూచనలివీ..

- విద్యార్థులు సున్నా, అరసున్నా, నిలువు గీతలపై బాగా సాధన చేయాలి. ఆంగ్ల, తెలుగు భాషల్లో మెరుగైన రాత కోసం అపసవ్య దిశలో రాయడం నేర్చుకోవాలి.
- జవాబులు రాసేటప్పుడు ప్యాడ్ పైకి వాలిపోకుండా సాధ్యమైనంత వరకు కూర్చోని రాయడం మంచిది. అక్షరాలు, పదాలు, వాక్యాల మధ్య తగిన ఖాళీ ఉండేలా చూసుకోవాలి.
- పరీక్షల సమయంలో సమాధాన పత్రంలో జవాబు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే పత్రాన్ని దిద్దే ఉపాధ్యాయులు అదనపు మార్కులు వేసే అవకాశం ఉంటుంది.
- ఒక పేజీకి 16 నుంచి 20 పంక్తులు మించకుండా ఉండాలి. అందుకే ప్రతి రోజు కొద్దిసేపు రాతపై సాధన చేస్తే పరీక్షల్లో ఆందోళన లేకుండా సాఫీగా రాయొచ్చు.

చేతిరాతపై మక్కువ ఏర్పరచుకోవాలి



చేతిరాతపై విద్యార్థులు మక్కువ ఏర్పరచుకుని సాధన చేయాలి. చేతి రాత అందంగా ఉంటే మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులకు బాగా అర్థమై మంచి మార్కులకు ఆస్కారమేర్పడుతుంది.
– కొవ్వూరి అమ్మిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, కొంకుదురు ఉన్నత పాఠశాల

అక్షరమాల ఓ ఆయుధం



మంచి ఫలితాల సాధనకు చక్కటి అక్షరమాల ఓ ఆయుధం లాంటిది. సమాధాన పత్రం దిద్దే అధ్యాపకుడికి అక్షరాలు అందంగా కనిపిస్తే మార్కులు పెరిగే అవకాశముంటుంది. పాఠ్యాంశాల పునశ్చరణతో పాటు గుండ్రని చేతిరాతపై పట్టు సాధించాలి.
– వెంకటేశ్వరరావు, ఎంఈవో, బిక్కవోలు

మార్చి 1న కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ

రంగంపేట: మండలంలోని చినదొడ్డిగుంటలో హనుమత్ లక్ష్మణ సీతా సమేత కోదండరామచంద్రమూర్తి స్వామివార్ల విగ్రహ మహోత్సవం మార్చి 1న నిర్వహించనున్నట్టు కోదండ రామాలయం కమిటీ తెలిపింది. దాంట్లో భాగంగా ఈ నెల 27 సోమవారం ఉదయం 8 గంటల నుంచి విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షాధారణ, 28 మంగళవారం గోపూజ, మండప పూజలు, సర్వదేవతా హోమాలు, మార్చి 1 బుధవారం కోదండ రామచంద్రమూర్తి విగ్రహ ప్రతిష్ఠ జరుగుతాయని చెప్పారు.

యోగా శిక్షణ ప్రారంభం


యోగాలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాజానగరం: మండలంలోని దివాన్‌చెరువులో సేవా ఉగాది సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహిస్తున్న యోగా శిక్షణను స్థానిక వైద్యుడు రాంబాబు ఆదివారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. గ్రామంలోని గోదావరి విద్యా పీఠం ప్రాంగణంలో 30 రోజులు జరిగే ఈ శిక్షణకు వంకా సూర్యనారాయణ అండ్ సన్స్ సహకారం అందిస్తున్నారు. యోగాలో పీజీ డిప్లమా చేసిన ఎంవీవీ రమణ శిక్షకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 6.30 నుంచి 7.30 గంటల వరకు యోగా సాధన జరుగుతుంది. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు గ్రంధి నానబ్బులు, అధ్యాపకులు డాక్టర్ తలారి వాసు, మాజీ వైస్ ఎంపీపీ వంక మల్లిబాబు, వంక సత్తిబాబు, తిక్కన వెంకట్రావు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టాలి

పెదపూడి: సామూహికంగా ఎలుకల నిర్మూలన చేపట్టడంతో రైతులకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. ఆయన పెదపూడిలో ఆదివారం మాట్లాడుతూ రైతులు 96 గ్రాముల నూకలు, రెండు గ్రాముల ఎలుకల నివారణ మందు బ్రోమోడయోలిన్, రెండు గ్రాముల నూనెతో కలిపిన మిశ్రమాన్ని కలిపి పొట్లాలుగా తయారు చేసి ఎలుకల బొరియల వద్ద పెట్టడంతో ఎలుకలు వాటిని తిని చనిపోతాయన్నారు. ఇప్పటికే రైతులకు ఎలుకల నిర్మూలన మందు పంపిణీని పూర్తి చేశారన్నారు.

కళలు, కళాకారుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి


రథోత్సవం వద్ద ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా
- ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవం

మధురపూడి: కళలు, కళాకారులను ప్రోత్సహించడం, వారికి అండగా నిలబడడం సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. కోరుకొండ మండలం శ్రీరంగ పట్నంలో ఆదివారం జరిగిన పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కళలకు పుట్టిల్లుగా శ్రీరంగపట్నం విరాజిల్లుతోందని, అన్ని కళారూపాలను ప్రదర్శించడంలో ఆ గ్రామస్తులకే సాధ్యమన్నారు. తొలుత వీరబ్రహ్మేంద్రస్వామి వారిని దర్శించుకున్నారు. వంద సంవత్సరాలుగా స్వామివారి ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కళారూపాలను ప్రదర్శించే స్థానికులు విశాఖ జిల్లాలో ప్రదర్శన అనంతరం తిరిగి వస్తుండగా తుని సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొందరు మృతి చెందగా, మరి కొందరు క్షతగాత్రులయ్యారన్నారు. మృతి చెందిన ప్రతి వ్యక్తికి రూ.2 లక్షలు, గాయాలపాలైన వారికి రూ.లక్ష సహాయంగా అందించనున్నట్టు తెలిపారు. మృతుల కుటుంబాలకు సహాయాన్ని అందించాలని ఎమ్మెల్యే రాజా కోరినట్టు తెలిపారు. అలాగే కళాకారుల సౌకర్యం, కార్యకలాపాల నిర్వాహణ కోసం భవన నిర్మాణానికి రూ.10 లక్షల ప్రభుత్వం కేటాయించినట్టు తెలిపారు. త్వరలోనే స్థలాన్ని గుర్తించి, అందజేయనున్నట్టు తెలిపారు. ఈ మేరకు స్పందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆ పరిహారాన్ని త్వరలో అందించనున్నట్టు ఎమ్మెల్యే రాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరంగపట్నం సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు మద్దాల రమణ, అత్తిలి రాంప్రసాద్, కొయిదాల నానాజి, సూరిశెట్టి అప్పలస్వామి, భద్రం పాల్గొన్నారు.

ఆదిరెడ్డికి రాజ్యసభ సభ్యుడు బోస్ పరామర్శ


కొండబాబును పరామర్శిస్తున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్


వినూష చిత్రపటం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి తదితరులు

అనపర్తి: స్థానిక జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి ఆదిరెడ్డి(కొండబాబు)ను రాజ్యసభ సభ్యుడు, పార్టీ ఉభయ గోదావరి జిల్లాల రీజినల్ కోఆర్డినేటర్ పిల్లి సుభాష్ చంద్రబోస్ ఆదివారం పరామర్శించారు. ఆదిరెడ్డి తృతీయ కుమార్తె వినూష ఇటీవల ఆకస్మికంగా మృతి చెందింది. దీంతో ఆయన కొండబాబును పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.
జీబీఆర్ విద్యాసంస్థల అధినేత తేతలి ఆదిరెడ్డి(కొండబాబు)ను కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదివారం పరామర్శించారు. కొండబాబు తృతీయ కుమార్తె వినూష(గోమ) ఈ నెల 21న అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందింది. దీంతో అనపర్తి విచ్చేసిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి వినూష చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం కొండబాబు, కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇదిలావుండగా శనివారం రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, అమ్మిరెడ్డి ఆయిల్స్ అధినేత ఎస్‌వీఆర్ అమ్మిరెడ్డి, డీఆర్‌కే రెడ్డి తదితరులు కొండబాబును పరామర్శించారు.

సాయిరామారెడ్డికి పరామర్శ

స్థానిక శివదుర్గ వ్యాపార సంస్థ అధినేత నల్లమిల్లి సాయిరామారెడ్డిని ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి పరామర్శించారు. సాయిరామారెడ్డి మామయ్య కర్రి వెంకటరెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో సాయిరామారెడ్డి కుటుంబసభ్యులను జగ్గిరెడ్డి పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

సూర్యభగవానుడు ప్రత్యక్ష దైవం


సూర్యకల్యాణంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: లోక కల్యాణానికి ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుని కరుణ చాలా ముఖ్యమని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. స్థానిక సీతంపేట ఏపీ పేపర్‌మిల్లు రోడ్డులో సప్తమ వార్షిక మాఘమాస దీక్షగా 36 రోజులు నిర్వహించిన హోమ శతచండీ సహిత సౌర యాగం పూర్ణాహుతి కార్యక్రమంలో ఆదివారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూర్యభగవానునికి అత్యంత ప్రీతికరమైనది మాఘమాసమన్నారు. వడలి కుమార్ శర్మ ఆధ్వర్యంలో జనవరి 22 నుంచి ఫిబ్రవరి 26 వరకూ ఇంతటి పవిత్ర కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ జేఏసీ ఛైర్మన్ మార్గాని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు


ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవార్లు

పెదపూడి: జి.మామిడాడలో ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, వ్రత పూజలు నిర్వహించారు. అనంతరం స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యే రాజా పరామర్శ


సీతానగరంలో బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజా

సీతానగరం: ఇటీవల మృతి చెందిన వారి కుటుంబాలను, ప్రమాదంలో గాయపడిన వారిని ఆదివారం రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పరామర్శించారు. మండలంలో కూనవరంలో ఎంపీటీసీ నల్లమోలు భాస్కర్ అమ్మమ్మ మేండ్రు కొండమ్మ ఇటీవల మరణించగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. నందూరి సుబ్బారావు భార్య పాపమ్మ మృతి చెందింది. వారి కుటుంబ సభ్యలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రఘుదేవపుం, రఘుదేవపురంలో పాముకాటుకు గురైన చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఉమ్మడిశెట్టి సురేష్‌ను పరామర్శించారు. వసలపూడి రామయ్య, మల్లిమొగ్గల రఘుపతి, నల్ల పాపమ్మ, సీతానగరంలో కంచు రాజు, బండారు ముత్యాలమ్మ, కిలపర్తి సింహాచలం, చేకూరి దుర్గారావు, పేరపు రత్నావతి, అప్పన్న కొండ వెంకన్నబాబు, గొంతెన సత్యనారాయణ, మల్లేటి సత్యవతి, బూలా గౌతం, మేడ రాజు తదితరుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న జొన్నకూటి ప్రసన్న కుమార్‌ని ఎమ్మెల్యే రాజా పరామర్శించారు.

ముగిసిన గోదావరి బాలోత్సవం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

ప్రకాశం నగర్: గోదావరి బాలోత్సవం పిల్లల పండగ ఆదివారం సాయంత్రం కోలాహలంగా ముగిసింది. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో జరిగిన ముగింపు సభలో ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలల స్వేచ్ఛను హరించవద్దని సూచించారు. వారికి నచ్చిన విధంగా నడుచుకునేలా ప్రోత్సహించాలన్నారు. బాలల్లో అత్యుత్తమ ప్రతిభ ఉంటుందని, దానిని వెలికితీయడం ద్వారా వివిధ రంగాల్లో నిష్ణాతులుగా ఎదుగుతారని గ్రహించాలన్నారు. ప్రముఖ న్యాయవాదులు మద్దూరి శివసుబ్బారావు, ముప్పాళ్ల సుబ్బారావు, డీఈవో బి.దిలీప్‌కుమార్ మాట్లాడుతూ బాలల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయడం ద్వారా మంచి సమాజం ఏర్పడుతుందని, అందుకు బాలోత్సవాలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. అనంతరం రెండు రోజులపాటు కల్చరల్, అకడమిక్ విభాగాల్లో నిర్వహించిన 60 పోటీల్లో విజేతలుగా నిలిచిన బాలలకు నున్న తిరుమలరావు, డాక్టర్ గన్ని భాస్కరరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు కృష్ణకుమార్, పి.తులసి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పరామర్శ


పల్లిజాన్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బీజేపీ నాయకులు


రాజమహేంద్రవరం రూరల్: తొర్రేడు గ్రామానికి చెందిన ఎస్సీ యువకుడు పల్లిజాన్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన నేపథ్యంలో ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు యానాపు ఏసు, పార్టీ శ్రేణులు పరామర్శించారు. ఘటనను జిల్లా ఎస్పీ, హ్యూమన్ రైట్స్, నేషనల్ ఎస్సీ కమిషన్ దృష్టికి తీసుకువెళతామని తెలిపారు. పరామర్శించిన వారిలో దున్నా సుమన్ బాబు, రాయుడు సత్యనారాయణ, ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

'లాట్స్'తో యువతకు మంచి భవిష్యత్తు


కార్యక్రమంలో పాల్గొన్న నేషనల్ ప్రెసిడెంట్ కార్తికేయన్


రాజమహేంద్రవరం సిటీ: జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ జోన్–4 ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన లోకల్ ఆర్గనైజేషన్ ట్రైనింగ్ సెషన్స్ (లాట్స్) యువత భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని జేసీఐ నేషనల్ ప్రెసిడెంట్ జేఎఫ్ఎస్ కార్తికేయన్ అన్నారు. స్థానిక ఆనంద్ రీజెన్సీలో శని, ఆదివారాల్లో రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కార్తికేయన్ మాట్లాడుతూ జేసీఐ లామ్ ఆఫీసర్స్ మరింత మెరుగ్గా పనిచేయడానికి ఈ ట్రైనింగ్ దోహద పడుతుందన్నారు. అనంతరం జేసీఐ రాజమహేంద్రవరం స్టార్టప్స్ లామ్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఈ వెబ్ ప్లాట్‌ఫాం ద్వారా అంకుర సంస్థలను ప్రోత్సహించాలనే ఆలోచన చేసిన లాంమెంటర్ రామ్‌కుమార్ రాందేవ్‌ను అభినందించారు. జేసీఐ రాజమహేంద్రవరం గోదావరి ఫాస్ట్ ప్రెసిడెంట్ రామ్‌కుమార్ రాందేవ్ మాట్లాడుతూ రాజమహేంద్రవరంలోని వనరులను సద్వినియోగం చేసుకుంటూ యువత ఎదగాలని సూచించారు. ఇందుకు సరైన వేదిక కల్పించాలనే ఉద్దేశంతో రాజమహేంద్రవరం స్టార్టప్స్ ప్రారంభించామన్నారు. దీనిద్వారా సభ్యులకు జీవితంలో ఎదగటానికి అవసరమైన శిక్షణ, నైపుణ్యాలు అందిపుచ్చుకునే అవకాశం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జేసీఐ జోన్ ప్రెసిడెంట్ వర్మ, రాహుల్, డాక్టర్ మురళీ, డాక్టర్ ప్రియాంక, రాష్ట్రవ్యాప్తంగా 250 మంది లామ్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఆ బావికి 90 ఏళ్లు


పాండురంగస్వామి ఆలయం సమీపంలోని అతిపురాతన బావి

మధురపూడి: ఆ బావికి 90ఏళ్లు. నిత్యం నీటితో కళకళలాడుతుంది. ఇప్పటికీ ఆ గ్రామ ప్రజల అవసరాలను తీర్చుతుంది. అంతేకాక లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వచ్చి భక్తుల దాహార్తిని తీర్చుతుంది. మండల కేంద్రమైన కోరుకొండ పాండురంగస్వామి ఆలయం సమీపంలోని ఈ బావి ఉంది. ఈ బావి 45 అడుగులు ఉంటుంది.నూతిలో నీరు నిత్యం ఉండడంతో ఆ గ్రామ ప్రజలు ఈ బావినీటితోనే అవసరాలను తీర్చుకుంటారు.

ఘనంగా 'బాలరాజు' వజ్రోత్సవ వేడుక


మాట్లాడుతున్న కందుల దుర్గేష్, చిత్రంలో జిత్‌మోహన్‌మిత్ర

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): 'మన అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' వ్యవస్థాపకుడు అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు నటించిన జానపదచిత్రం బాలరాజు వజ్రోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. గోకవరం బస్టాండ్ సమీపంలోని జిత్‌మోహన్‌మిత్ర కళావేదికపై జిత్‌మోహన్‌మిత్రా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జనసేన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కందుల లక్ష్మీదుర్గేష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విశ్రాంత పోలీసు అధికారి, కళాభిమాని వలిరెడ్డి జగపతిని అక్కినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో కందుల దురేష్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. సుక్కిరెడ్డి శ్రీనివాసరావు, దేశిరెడ్డి బలరామ నాయుడు, సుంకర భాస్కర రంగారావు, మిర్తిపాటి శేషగిరిరావు, బి.సీతారామారావు, ఎస్.సూరిబాబు కట్టా చంద్రరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన అవసరం

సీటీఆర్ఐ: ప్రతి ఒక్కరూ కేన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ యడ్లపల్లి దీపక్ అన్నారు. స్థానిక వెంకటేశ్వరనగర్‌లోని ఐఎంఏ హాల్లో జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం కేన్సర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలిదశలో కేన్సర్‌ను ఎలా గుర్తించాలి, లక్షణాలు, చికిత్స పద్ధతులు, నివారణ మార్గాలను వివరించారు. ఇందులో భాగంగా సుగరు, బీపీ పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, సెక్రటరీ మూర్తి, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.